క్లుప్తంగా

సీసీఎం అండ్ సీఎస్ ప్రిన్సిపల్‌గా వెంకటేశ్వర్లు


ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ మిడసల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 1992లో వర్సిటీలో అధ్యాపకులుగా చేరిన ఆయన 32 ఏళ్లుగా వర్సిటీలో వివిధ హోదాలలో పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో 28 పీహెచ్‌డీ, 7 ఎంఫిల్, 10 పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లు అందజేశారు. ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో సీసీఎం అండ్ సీఎస్ విభాగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎస్‌జీఎస్ విద్యార్థులకు ఎన్‌సీసీ అవార్డులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో రెండు వారాలపాటు జరిగిన ఆలిండియా వాయు సైనిక్ శిబిరంలో టీటీడీకి చెందిన ఎస్‌జీఎస్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ విద్యార్థులను ప్రత్యేకం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన వాయు సైనిక్ క్యాంపులో కళాశాల విద్యార్థి లీలాసాగర్ పాల్గొని, ప్రతిభ అవార్డును దక్కించుకోవడం అభినందనీయమన్నారు. అలాగే స్థానిక ఓ ప్రైవేటు స్కూల్‌లో జరిగిన కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో కళాశాలకు చెందిన 27 మంది విద్యార్థులు ప్రతిభ చూపి ధ్రువపత్రాలు అందుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, డాక్టర్ కోటీశ్వరయ్య, డాక్టర్ మాదన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

59 మంది సచివాలయ ఉద్యోగుల చేరిక


కొత్తగా విధుల్లో చేరే వారికి అనుమతిస్తున్న ఎంపీడీవో రామచంద్ర

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల నుంచి 89 మంది ఉద్యోగులు బదిలీపై పక్క మండలాలకు వెళ్లారు. ఇతర మండలాల నుంచి బదిలీ అయిన వారిలో 59 మంది విధుల్లో చేరారు. వారు గురువారం ఎంపీడీవో రామచంద్రను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఐదేళ్లు ఒకేచోట విధులు నిర్వహించిన వారిని బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తిరుపతి రూరల్ మండలం నుంచి 206 మంది ఉద్యోగులు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. అందులో 89 మంది పక్క మండలాలకు బదిలీ కావడంతో వారంతా ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. కొంత మంది తిరుపతి రూరల్ మండలంలోనే కొనసాగుతుండగా మరికొంత మంది పక్క జిల్లాలకు వెళ్లారు. కొత్తగా చేరిన వారికి విధులు అప్పగించడంతో పాటు రిలీవ్ అవుతున్న వారికి ఎంపీడీవో అనుమతి తప్పనిసరి కావడంతో ఎంపీడీవో కార్యాలయం సచివాలయ ఉద్యోగులతో కిటకిటలాడింది.

స్మార్ట్ మీటర్లు వద్దు

తిరుపతి కల్చరల్: ప్రజలపై విద్యుత్ భారం మోపుతూ అదానీ స్మార్ట్‌మీటర్లు తీసుకురావడం దుర్మార్గమని, స్మార్ట్ మీటర్లు రద్దు చేసి ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ, సీపీఐ జిల్లా నేత చిన్నం పెంచలయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు టి.సుబ్రమణ్యం, వేణుగోపాల్, మాధవ్, పి.సాయిలక్ష్మి, బుజ్జి, నరేంద్ర, మల్లికార్జునరావు, రాధాకృష్ణ, శ్రీనివాసులు, సీఐటీయూ నేత బాలసుబ్రమణ్యం, నాగభూషణం పాల్గొన్నారు.

20 నుంచి కోదండ రామయ్య పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో ఈనెల 20 నుంచి 22 వరకు మూడురోజుల పాటు పవిత్రోత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈనెల 19న సాయంత్రం నిర్వహించే అంకురార్పణతో స్వామివారి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజు యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం, రెండోరోజు పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడో రోజు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. గృహస్తులు ఇద్దరు రూ.500 చెల్లించి పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు.

హామీల అమలుపై ఆంక్షలెందుకు?


చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి


తిరుపతి 13వ డివిజన్‌లో ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

- ఎన్నికల్లో సంక్షేమ పథకాల గ్యారెంటీ బాండ్లు ఇచ్చి మోసగించారు
- చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరించిన భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: ఎన్నికల్లో మొసలి కన్నీరు కారుస్తూ సంక్షేమ పథకాల బాండ్లు ఇస్తూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తోపాటు కూటమి నాయకులు ఇంటింటికి వచ్చి చెప్పారని తిరుపతి నగర ప్రజలు తెలిపారు. అయితే ఇప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీల్లోని సంక్షేమ పథకాలు పొందాలంటే అడుగడుగునా ఆంక్షలు పెడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు హామీల మేనిఫెస్టో లేదు, మాకిచ్చిన బాండ్లకు విలువ లేదంటూ మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను గురువారం వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులతో కలిసి తిరుపతి నగరంలోని 18, 36, 41, 39, 04, 02వ డివిజన్లలోని ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించారు. సంక్షేమ పథకాలు వస్తున్నాయా టూ అడిగే నాథుడే లేరయ్యా అంటూ తిరుపతి నగర ప్రజలు భూమన అభినయ్‌రెడ్డి వద్ద వాపోయారు. అడగకనే అనేక సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను కాదనుకున్నందుకు మాకు కన్నీళ్లే మిగిలాయని వాపోయారు. ఈ సందర్భం భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఇచ్చిన హామీల కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందించి, పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు ఆపలేదని గుర్తు చేశారు. అయితే గత ఎన్నికల్లో చంద్రబాబు చెప్పిన మేనిఫెస్టో హామీలను అమలు చేయక ప్రజలు నష్టపోయారన్నారు. ఇప్పటికైనా ప్రజా నాయకుడు ఎవ్వరో, మోసగాడు ఎవ్వరో గుర్తించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్ ఉమా అజయ్, బొగ్గుల పునీత, అజయ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, రాజేష్, వాసు యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యను భ్రష్టు పట్టించారు


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీ విద్యను భ్రష్టు పట్టించారని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక బైరాగిపట్టిడలోని గంధమనేని శివయ్యభవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫలితాలు వచ్చి మూడు నెలలు గడిచిన తర్వాత డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ఎట్టకేలకు ఉన్నత విద్యా శాఖ ప్రొసీడింగ్స్ ఇచ్చారన్నారు. అయితే సిలబస్, విధివిధానాలు, కోర్సులు, కళాశాల అఫిలియేషన్స్, ఫీజుల ప్రస్తావన చేయకుండా రాత్రికి రాత్రే జీఓను ఉన్నత విద్యా మండలి ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఎవరికోసం ఇచ్చారని మండిపడ్డారు. డిగ్రీలో డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం కావాలని విద్యార్థులు ఉపాధ్యాయ సంఘాలు, లెక్చరర్లు, విద్యార్థి సంఘాలు, మేధావులు ప్రభుత్వానికి ఉన్నత విద్యాశాఖ అధికారులకు అనేక సార్లు మొరపెట్టుకున్నా సింగిల్ మేజర్ సబ్జెక్టుకు ఆమోదించారని ప్రశ్నించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, నగర అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి వినయ్ కుమార్, నాయకులు అశోక్, సిద్ధు పాల్గొన్నారు.

అలసి.. సొలసి..


చెట్టు నీడలో అన్నం తింటున్న వేదాం గ్రామస్తులు

తిరుపతి రూరల్: శ్రీకాళహస్తి రూరల్ మండలం వేడం గ్రామానికి చెందిన పిల్లలను నాలుగు కిలోమీటర్ల దూరంలోని చిన్నమిట్టకండ్రిగ పాఠశాలలో విలీనం చేశారు. వారిని అంతదూరం పంపడానికి వీలుకాదని, తమ గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించుకునేందుకు గురువారం ఉదయం తిరుపతిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. కలెక్టర్ లేకపోవడంతో గంటల తరబడి కలెక్టరేట్ ప్రధాన గేటు ముందున్న చెట్టు కిందే కూర్చున్నారు. మధ్యాహ్నం భోజన సమయం దాటుతున్నా కలెక్టర్ రాకపోవడంతో అదే గ్రామానికి చెందిన ఓ రైతు అందరికీ అన్నం తేవడంతో అక్కడే కూర్చుని తిన్నారు.

కలెక్టర్ సారూ.. ఒక సారిలా చూడండి!

- ఎస్వీయూ కోఆపరేటివ్ స్టోర్‌లో అయోమయం
- తాత్కాలిక ఉద్యోగుల చేతికి స్టోర్ పగ్గాలు
- సభ్యత్వం లేని వారికి స్టోర్‌లో కీలక బాధ్యతలు
- ఎమ్మెల్యే సిఫారసులతో కమిటీ వేసే ప్రయత్నం
- స్టోర్ సభ్యులైన ఉద్యోగుల ఆగ్రహం



ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్ కార్యాలయం

తిరుపతి సిటీ: ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోంది. ఇందులో భాగంగానే రాజకీయ రంగు పులుముతూ నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన అప్పటి డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ అధికారి ఆధ్వర్యంలో ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సభ్యులంతా ఏకగ్రీవంగా స్టోర్‌కి ఎన్నికలు జరపాలని నిర్ణయించారు. ఎన్నికల్లో గెలవలేమని భావించిన కొందరు సభ్యులు పక్కా ప్లాన్ వేశారు. స్థానిక ఎమ్మెల్యేని ఆశ్రయించి తమకే స్టోర్ పగ్గాలు కావాలని ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీ పేరుతో స్టోర్‌ను నడిపేందుకు పన్నాగం వేశారు.

అర్హత, సభ్యత్వం లేని వ్యక్తుల చేతికి పగ్గాలు

ఉద్యోగుల సౌకర్యార్థం ఉన్నత లక్ష్యాలతో ఏర్పాటు చేసిన వర్సిటీ కో-ఆపరేటివ్ స్టోర్‌పై కొందరు కన్నేశారు. సుమారు ఇప్పటికే రూ.కోటికిపైగా ఆర్థిక లావాదేవీలు నడుస్తున్న స్టోర్‌ను నిలువునా దోచుకునే ప్రణాళికతో పావులు కదుపుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే సహాయ సహకారాలతో కమిటీ పేరుతో స్టోర్ పగ్గాలు చేపట్టేందుకు అర్హత, సభ్యత్వం లేని ఒక టైమ్‌స్కేల్ ఉద్యోగి, మరో తాత్కాలిక ఉద్యోగి, ఒక శాశ్వత ఉద్యోగిని నియమించుకునేందుకు పన్నాగం పన్నారు. వాస్తవంగా స్టోర్‌లో సభ్యత్వం లేని వ్యక్తి ఎన్నికలలో పోటీ చేసేందుకు, స్టోర్‌లో అడుగుపెట్టేందుకు అనర్హుడు. కానీ నిబంధనలను బేఖాతరు చేస్తూ పావులు కదుపుతున్నారు.

స్తంభించిన లావాదేవీలు

ఇప్పటి వరకు ప్రభుత్వం ఎస్వీయూ స్టోర్‌కు పర్సనల్ ఇన్‌చార్జిని నియమించకపోవడం దారుణమని సభ్యులు వాపోతున్నారు. దీంతో స్టోర్‌లో లావాదేవీలు స్తంభించిపోయాయని, ప్రస్తుత పనిచేస్తున్న ఉద్యోగులకు కనీసం వేతనాలు సైతం చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పాటు వంట గ్యాస్ ఏజెన్సీలకు సైతం బిల్లులు చెల్లించకపోవడంతో గ్యాస్ సరఫరాపై ప్రభావం చూపే దయనీయ పరిస్థితి నెలకొంది.

కలెక్టర్ సారూ... చొరవ చూపండి

ఎస్వీయూ స్టోర్‌లో జరిగే వ్యవహారాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి. జనరల్‌బాడీ మీటింగ్ నిర్ణయాలను సైతం పక్కన పెట్టి ఇష్టానుసారంగా రాజకీయ నాయకుల అండదండలతో అనర్హులు స్టోర్‌లోకి జొరబడాలని చూడడం దారుణం. సభ్యతం లేని వక్తులు కమిటీలో సభ్యులుగా చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకుండా అలసత్వం వహిస్తుండడంతో ఉద్యోగులకు గ్యాస్ సరఫరా సైతం సందిగ్ధంలో పడే పరిస్థితి ఏర్పడింది. కలెక్టర్ తక్షణం స్టోర్‌లో జరుగుతున్న వ్యవహారాలపై ఆరా తీసి జనరల్ బాడీ నిర్ణయించిన ప్రకారం ఎన్నికలు జరపాలని స్టోర్ సభ్యులైన టీచింగ్, నాన్ టీచింగ్ ఎస్వీయూ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

యాలమూరికి ఘన నివాళి


యాలమూరి శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న భూమన కరుణాకరరెడ్డి


యాలమూరి శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ యాలమూరి శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన యాలమూరి శ్రీనివాసులురెడ్డి శుభస్వీకరణలో వారు పాల్గొని నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భూమన కుటుంబ రుణం తీర్చుకోలేనిది..


భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న ఎస్సీ నేతలు

తిరుపతి మంగళం: అట్టడుగు వర్గాలకు చెందిన వాళ్లమని చూడకుండా సొంత కుటుంబ సభ్యుల్లా భావించి ఉన్నత పదవులను కల్పించి, సమాజంలో ఉన్నత స్థానాన్ని కల్పించిన భూమన కుటుంబానికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలమని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు తలారి రాజేంద్ర, అనంతపురం ఎస్సీసెల్ ఇన్‌చార్జ్ నల్లాని బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారపు వాసు అన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద గురువారం ఎస్సీ నేతలు చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డికి దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. పది నియోజకవర్గాల మండల కమిటీలు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో కలిసి కమిటీలు త్వరగా పూర్తి చేయాలని కరుణాకరరెడ్డి ఎస్సీ నేతలకు సూచించారు.

సీపీఎస్ రద్దు కోసం వెంకన్నకు ప్రత్యేక పూజలు


మాట్లాడుతున్న మాచన రఘునందన్

చంద్రగిరి: భాగస్వామ్య పింఛను పథకం(సీపీఎస్) రద్దు కావాలన్న తమ అభిమతం నెరవేరాలని కోరుతూ శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు చేసినట్టు ఆల్ ఇండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏఐఎన్‌పీఎస్ఈఎఫ్) దక్షిణ భారత ఇన్‌చార్జి మాచన రఘునందన్ చెప్పారు. ఆయన గురువారం సీపీఎస్ రద్దు కోసం శ్రీనివాస మంగాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని కోరుతూ వారణాసిలో ఈ నెల 20వ తేదీన నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని స్వామి వారిని ప్రార్థించినట్టు చెప్పారు. పాలకులు సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఉద్యోగుల ఆర్థిక భద్రత విషయం వారికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా కోటి మందికి పైగా ఉద్యోగులు న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు అయ్యేలా చూడాలని దైవాన్ని అర్థిస్తున్నారని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసేలా పాలకులకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ ఆలయాల్లో పూజలు చేస్తున్నట్టు వివరించారు. ఆయనవెంట రాజేశ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

- నగరంలో పొంగిపొర్లిన డ్రైనేజ్ కాలువలు
- ఇబ్బంది పడ్డ వాహనదారులు



మధుర నగరిలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో గత రెండు రోజుల నుంచి విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోతతో కూడిన ఎండలు మండుతున్నాయి. సాయంత్రం 6 నుంచి రాత్రి వరకు భారీ వర్షం దంచి కొడుతోంది. బుధవారం ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ నగర ప్రజలు సాయంత్రం కుండపోత వర్షం కురవడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. కానీ నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు రాత్రంతా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఇబ్బందులు ఎదుర్కొనక తప్పలేదు. నగరంలోని లీలామహల్ నుంచి కరకంబాడి వెళ్లే ప్రధాన రహదారి డ్రైనేజ్ నీటితో ఏరులా ప్రవహించడంతో ఆ దారిలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షానికి తలదాచుకునేందుకు నగరంలోని యాచకులు శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ కింద స్థావరంగా మార్చుకున్నారు. అలిపిరి పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ఫ్లైఓవర్ కింద భాగంగా యాచకులతో నిండిపోయింది

రేపటి నుంచి తిరువడిపురం ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈనెల 19వ తేదీ శనివారం నుంచి 28వ తేదీ వరకు శ్రీఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉత్సవ రోజుల్లో ఉదయం శ్రీఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం, సాయంత్రం ఆస్థానం చేపడతారు. ఈ నెల 28న శ్రీఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీగోవిందరాజ స్వామివారు, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీగోవిందదరాజ స్వామి, శ్రీఆండాళ్ అమ్మవారిని అలిపిరికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుంచి రామనగర్ క్వార్టర్స్‌లోని గీతామందిరం, ఆర్ఎస్ మాడ వీధిలోని శ్రీవిఖనసాచార్యుల ఆలయం, చిన్న జీయర్ మఠం మీదుగా ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకుంటారు. రాత్రి 8 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారి సన్నిధిలో శాత్తుమొర నిర్వహిస్తారు.

నారాయణాద్రిలో అరుదైన శస్త్ర చికిత్స


మాట్లాడుతున్న ఆసుపత్రి డైరెక్టర్లు, వైద్యులు

తిరుపతి తుడా: ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలో గురువారం మరో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు డైరెక్టర్లు డాక్టర్ ఎస్వీ ప్రసాద్, డాక్టర్ సునందకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ఉదయ్‌భాస్కర్ (45)అనే రోగికి హార్ట్ అటాక్ రావడంతో నారాయణాద్రి ఆసుపత్రికి తీసుకువచ్చారని చెప్పారు. అప్పటికే సదరు రోగి అసిస్టోల్ స్టేట్ (సుదీర్ఘంగా గుండె ఆగిపోవడం)లో ఉన్నారని, ఆసుపత్రి ఎమెర్జెన్సీ బృందం తక్షణం డీసీ షాక్ ద్వారా ట్రీట్‌మెంట్ అందించి గుండెను పనిచేసే స్థితికి తీసుకువచ్చారని తెలిపారు. పరిస్థితి అత్యంత సంక్లిష్టంగా మారడంతో వైద్య బృందం పట్టుదలతో శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను కాపాడారని తెలిపారు. డాక్టర్ స్వరూప్ నాయకత్వంలోని బృందం విజయవంతంగా చికిత్సను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ అభిషేక్, డాక్టర్ సునందకుమార్, డాక్టర్ శ్రీధర్ ముని, డాక్టర్ సుమంత్‌రెడ్డి, డాక్టర్ త్రిలోక్, శ్రీకాంత్, ప్రతిమ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- ఆటోనగర్‌లోని క్రిష్ణారెడ్డి స్థూపం వద్ద ఉదయం 10 గంటలకు సీపీఐ నగర మహాసభ
- తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు అమ్మవారి తిరుచ్చి ఉత్సవం
- శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీపుండరీకవల్లి అమ్మవారు ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజా

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కార్డుదారులకు సక్రమంగా సరుకులు ఇవ్వాలి

రామచంద్రాపురం: రేషన్‌కార్డుదారులకు నిత్యావసర వస్తువులను సక్రమంగా అందజేయాలని తహసీల్దార్ మధుసూదన్ రావు ఆదేశించారు. ఆయన గురువారం రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు రేషన్ ఇవ్వాలన్నారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు షాపులను తెరిచి వుంచాలని ఆదేశించారు. అలాగే నెలలో 26 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులు, వికలాంగులు, నడవలేని స్థితిలో వున్న వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెరుగైన వసతులు కల్పించాలి

తిరుపతి అర్బన్: బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి రవి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భరత్ కుమార్‌ను కలిశారు. సీట్లు లేవంటూ పేద విద్యార్థులను దూరం చేయరాదని సూచించారు. మెనూ ప్రకారం భోజన వసతులు కల్పించాలని పేర్కొన్నారు. వర్షాకాలం నేపథ్యలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలియజేశారు. ప్రధానంగా నాణ్యమైన భోజన వసతులు కల్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్, నగర కార్యదర్శి తేజ, జిల్లా నాయకులు శివ, రెడ్డి కుమార్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేలు వితరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చంద్రగిరికి చెందిన కొండారెడ్డి శంకరప్రసాద్ దంపతులు గురువారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. దాతలకు స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేయించారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమల: తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 పైకి ఎక్కి కిందపడిపోయి గాయాలపాలైన వ్యక్తి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ నెల 15వ తేదీన సర్వదర్శనానికి స్నేహితులతో కలిసి వెళ్లిన ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా, బదాపూర్‌కు చెందిన ఎల్లయ్యరెడ్డి(42) వారి నుంచి విడిపోయి వైకుంఠం క్యూకాంప్లెక్స్ పైకి ఎక్కి ఉద్దేశపూర్వకంగా దూకి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఉదయం అతడిని గుర్తించిన టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పోలీసు సిబ్బంది ద్వారా తీవ్రంగా గాయపడిన అతడిని తిరుపతిలోని స్విమ్స్ అత్యవసర విభాగానికి తరలించారు ప్రమాదంలో కాళ్లు, చేతులు, నడుం, తలకు తీవ్రగాయాలైన అతడికి ఆసుపత్రి ఐసీయూలో చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసును నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించారు.